

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...





Contact Number
9059328777



విజయవాడ శుక్రవారం 4-09-2026 సంపుటి: 02 సంచిక : 64 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Friday, 4-09-2026 Volume :02 Issue: 64 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani


## ఎస్ఐఆర్'తో దేశవ్యాప్తంగా
# 13.37 కోట్ల ఓట్ల తొలగింపు!

- మూడు దశల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ
- మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్ల ఓట్లు తొలగింపు
- కర్ణాటకలో 1.08 కోట్ల ఓట్లకు కోత
- ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం ఓట్ల తొలగింపు
- ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగింపు
- ఇది తుది జాబితా కాదు.. డ్రాఫ్ట్ మాత్రమే
- పత్రాల పరిశీలన అనంతరం అర్హుల పేర్లు పునరుద్ధరించే అవకాశం
- పేరు గల్లంతైతే ఫామ్--6తో దరఖాస్తు
- అభ్యంతరాలకు ఫామ్--7.. వివరాల సవరణకు ఫామ్--8

**తాజా డేటా వెల్లడి.. తెలంగాణలో 73.39 లక్షల ఓట్లకు కోత**

02

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భారీగా ఓట్లు తొలగించినట్లు తాజా డేటా వెల్లడించింది. ఇప్పటివరకు మూడు దశల్లో జరిగిన ప్రక్రియలో దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓట్లు, అంటే మొత్తం ఓట్లలో 14.1 శాతం జాబితాల నుంచి తొలగించారు. ఇందులో మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్లు, కర్ణాటకలో 1.08 కోట్లు, తెలంగాణలో 73.39 లక్షల ఓట్లు తొలగించినట్లు సమాచారం. ఓట్ల శాతం పరంగా ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం కోత పడగా, ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగించారు.అయితే ఇవి తుది ఓటర్ల జాబితాలు కావని, డ్రాఫ్ట్ జాబితాలు మాత్రమేనని ఈసీఐ స్పష్టం చేసింది. పత్రాల పరిశీలన అనంతరం అర్హులైన వారి పేర్లను తిరిగి జాబితాలో చేర్చే అవకాశం ఉంది. ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైతే ఫామ్--6, అభ్యంతరాలు లేదా పేరు చేర్పు, తొలగింపుపై దరఖాస్తుకు ఫామ్--7, వివరాల సవరణకు ఫామ్--8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్లు తమ పేరు ఉందో లేదో ఈసీఐ ఓటర్ సేవల పోర్టల్ లేదా వోటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో పరిశీలించుకోవచ్చు.



## వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం

- ఆవాసాలు, సంచార మార్గాలపై ప్రత్యేక దృష్టి
- పులులు, ఏనుగుల రక్షణ చర్యలపై నివేదిక ఇవ్వండి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు
- క్షేత్రస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలపై టెలీకాన్ఫరెన్స్

**అమరావతి**

రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసేలా కొత్త ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇటీవల చోటుచేసుకున్న వన్యప్రాణుల మరణాల ఘటనలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఈమేరకు గురువారం ఆయన అటవీశాఖ ముఖ్య అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పులుల మరణాలపై అధ్యయనం చేసేందుకు అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి రాహుల్ పాండే నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి బాధ్యతలు అప్పగించారు. వన్య ప్రాణుల

-మిగతా 2 లో

## నేడే నింగిలోకి 'నాటీ బాయ్'!

- జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో
- శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు ప్రయోగం
- ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో
- ప్రయోగానికి ప్రారంభమైన కౌంట్‌డౌన్
- వరుస వైఫల్యాలతో 'నాటీ బాయ్'గా జీఎస్ఎల్వీకి పేరు
- తొలి 18 ప్రయోగాల్లో ఆరు విఫలమైన వైనం
- 36 వేల కిలోమీటర్ల ఎత్తులో జియోసింక్రోనస్ కక్ష్యలోకి ఉపగ్రహం
- భారత ఉపఖండ చిత్రాలను తరచూ అందించనున్న ఈవోఎస్-05
- సరిహద్దులు, వ్యూహాత్మక ప్రాంతాల నిఘాలో కీలకంగా మారనున్న ఉపగ్రహం



02

# నీళ్లపై దుష్ప్రచారం

## ప్రభుత్వ పనులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నిత్యం ప్రజల్లో ఉంటూ వాస్తవాలను వివరించాలి
- నీటి అంశంలో వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ఎల్నినో పరిస్థితులపై కేంద్రానికి లేఖ
- ఏపీలో 52 శాతం వర్షపాతం లోటు
- తాగునీటికి ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధం
- వెలిగొండ, పోలవరం నీటి విడుదలపై దుష్ప్రచారం వద్దు
- స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలి
- నిత్యావసర ధరల నియంత్రణపై నిరంతర పర్యవేక్షణ
- సూర్యఘర్ పథకంలో ఏపీని మొదటి స్థానానికి తీసుకురావాలి
- కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి,**

మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు సహచర మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఈ సంవత్సరంలోనే పూర్తి చేసి, వచ్చే ఏడాదికి ఎలాంటి ఎన్నికలు మిగలకుండా కోర్టు సమస్యలను పరిష్కరించుకుందామని చంద్రబాబు స్పష్టం చేశారు. 100 మున్సిపాలిటీలతో పాటు కోర్టు పరిధిలో ఉన్న 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా ఇంచార్జ్ మంత్రులు


-మిగతా 2 లో



# నేపాల్‌లో మృత్యుఘోష.

## 1,252 మంది మృతి

- 4,800 మంది గల్లంతు.. సహాయక చర్యల్లో భారత బృందాలు
- ఎనిమిది జిల్లాల్లో ముమ్మరంగా రెస్క్యూ ఆపరేషన్
- ఇప్పటివరకు 163 మంది భారతీయుల రక్షణ
- 275 మందికిపైగా భారతీయుల ఆచూకీ కోసం గాలింపు
- 19 మంది ఫోరెన్సిక్ నిపుణులతో భారత ప్రత్యేక బృందం
- సొరంగంలో 100 మీటర్ల వరకు చేరుకున్న భారత సాంకేతిక బృందం
- బాధిత ప్రాంతాలకు కార్గో డ్రోన్లతో సాయం అందించే యోచన
- హెలికాప్టర్లతో సహాయక సామగ్రి తరలింపు
- పర్వత ప్రాంతాల్లో పోర్టర్ల సేవలు వినియోగించనున్న ఐరాస



**ఖాట్మండు:**

నేపాల్‌లో వరద మృతుల సంఖ్య 1,252కు చేరుకుంది. గురువారానికి కనిపించకుండాపోయినవారి సంఖ్య 4,800గా ఉందని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఎంఏ) వెల్లడించింది. దాదాపు 21 వేల 314 మంది భద్రతా సిబ్బంది, సహాయక సిబ్బంది వరదల్లో దెబ్బ తిన్న ఎనిమిది జిల్లాల్లో మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఇప్పటివరకు 163 మంది భారతీయులను కాపాడినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

-మిగతా 2 లో




## తెలంగాణ, ఏపీలో వానలు...

- అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక
- తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి
- 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఏపీలో సెప్టెంబర్ 5 వరకు వర్షాలు కురిసే అవకాశం
- బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్లవద్దని హెచ్చరిక

**అమరావతి**

తెలుగు రాష్ట్రాల్లో రానున్న కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణలోని హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు,

-మిగతా 2 లో

## కొత్త పింఛన్లకు
# గ్రీన్ సిగ్నల్

**అర్హులందరికీ అక్టోబర్ నుంచి మంజూరు.. మంత్రులకు లోకేశ్ దిశానిర్దేశం**

- సుమారు 3 లక్షల కొత్త పింఛన్లపై కసరత్తు
- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛను అందించాలని సూచన
- అక్టోబర్‌లోగా స్థానిక ఎన్నికలు పూర్తి చేస్తామని వెల్లడి
- ముందుగా మున్సిపల్, ఆపై ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రభుత్వంపై సోషల్ మీడియా ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని సూచన



**అమరావతి**

రాష్ట్రంలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సూచించారు. క్యాబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో నిర్వహించిన సమావేశంలో కొత్త పింఛన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, శాఖల పనితీరుపై ఆయన కీలకంగా చర్చించారు. కొత్త పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా

-మిగతా 2 లో




## రష్యా ఆయిల్ కొంటాం

- ఉక్రెయిన్‌కు తేల్చి చెప్పిన భారత్
- 140 కోట్ల ప్రజల అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ఉంది
- రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు సహకరిస్తాం
- చర్చలు, దౌత్యంతోనే సమస్యకు పరిష్కారమన్న జైశంకర్
- కీవ్‌లో ఉక్రెయిన్‌కు భారత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ**

రష్యా నుంచి ఆయిల్ కొంటామని ఉక్రెయిన్‌కు భారత్ తేల్చి చెప్పేసింది. తమ పౌరుల అవసరాలు తీర్చాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, తమ దేశంలోని 140 కోట్ల ప్రజల అవసరాలను తీర్చడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేసింది. ప్రస్తుతం మధ్య ఆసియాలో నెలకొన్న పరిస్థితుల్లో చమురు సేకరణ సవాలుగా మారిందని, ఈ పరిస్థితులను ఉక్రెయిన్ గ్రహించాలని తెలిపింది. ఉక్రెయిన్‌లో.. ఆ దేశ మీడియాకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఇచ్చిన సమాధానమిది.

-మిగతా 2 లో

WWW.NETIDARSHINI.COM PRGI NO:APTEL/26/A5450 తెలుగు దిన పత్రిక

# నేడే నింగిలోకి 'నాటీ బాయ్'!

**-జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో**
**-శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు ప్రయోగం**
**-ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో**
**-ప్రయోగానికి ప్రారంభమైన కౌంట్‌డౌన్**
**-వరుస వైఫల్యాలతో 'నాటీ బాయ్'గా జీఎస్ఎల్వీకి పేరు**
**-తొలి 18 ప్రయోగాల్లో ఆరు విఫలమైన వైనం**
**-36 వేల కిలోమీటర్ల ఎత్తులో జియోసింక్రోనస్ కక్ష్యలోకి ఉపగ్రహం**
**-భారత ఉపఖండ చిత్రాలను తరచూ అందించనున్న ఈవోఎస్-05**
**-సరిహద్దులు, వ్యూహాత్మక ప్రాంతాల నిఘాలో కీలకంగా మారనున్న ఉపగ్రహం**



బెంగళూరు:
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) శ్రీహరికోట నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 మిషన్ ద్వారా అత్యాధునిక భూపరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-05ను ప్రయోగించేందుకు సిద్ధమైంది. శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు ప్రయోగం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన కౌంట్‌డౌన్ మొదలైంది. తొలి సంవత్సరాల్లో వరుస అనూహ్య ప్రదర్శనల కారణంగా ఈ రాకెట్ ఇస్రోలో 'నాటీ బాయ్' అనే మారుపేరును సంపాదించుకున్నది.ఈ రాకెట్ అభివృద్ధి పదేపదే ఎదురుదెబ్బలతో సాగింది. దాని మొదటి 18 ప్రయోగాల్లో ఆరు లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యాయి. తాజాగా మరోసారి ప్రయోగం చేపట్టనున్నారు. భూమికి సుమారు 36,000 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న జియోసింక్రోనస్ కక్ష్య నుంచి ఈవోఎస్-05 ఉపగ్రహం పనిచేస్తుంది. అందువల్ల ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించే అవకాశం లభిస్తుంది. తక్కువ కక్ష్యల్లో ఉండే ఉపగ్రహాలు ఒక ప్రాంతం మీదుగా ఎప్పటికప్పుడు దాటిపోతుంటాయి. కానీ జియోసింక్రోనస్ ఉపగ్రహం ఒకే ప్రాంతంపై సుదీర్ఘకాలం పాటు దృష్టి పెట్టగలదు. జీశాట్-1ఏగా కూడా పిలిచే ఈవోఎస్-05 భారత ఉపఖండానికి సంబంధించిన చిత్రాలను తరచూ అందించేలా రూపొందించబడింది. ముఖ్యంగా భారత్ తన సరిహద్దులు, వ్యూహాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచడానికి ఇది ఎంతో కీలకం కానున్నది.

# ఎస్ఐఆర్'తో దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓట్ల తొలగింపు!

**o మూడు దశల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ**
**o మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్ల ఓట్లు తొలగింపు**
**o కర్ణాటకలో 1.08 కోట్ల ఓట్లకు కోత**
**o ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం ఓట్ల తొలగింపు**
**o ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగింపు**
**o ఇది తుది జాబితా కాదు.. డ్రాఫ్ట్ మాత్రమే**
**o పత్రాల పరిశీలన అనంతరం అర్హుల పేర్లు పునరుద్ధరించే అవకాశం**
**o పేరు గల్లంతైతే ఫామ్--6తో దరఖాస్తు**
**o అభ్యంతరాలకు ఫామ్--7.. వివరాల సవరణకు ఫామ్--8**

: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన 'సర్' ద్వారా దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు, గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 'సర్' అంశానికి సంబంధించి ఇప్పటివరకు వెల్లడైన డాటా ప్రకారం.. దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓట్లను ఈసీఐ తొలగించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అన్నిచోట్లా కలిపి 13 కోట్ల మంది పేర్లను ఓటర్ జాబితానుంచి ఈసీఐ తొలగించింది. ఇది మొత్తం 14.1 శాతం ఓట్లకు సమానం.సర్' ప్రక్రియకు సంబంధించిన కీలక వివరాలివి. మొదట బిహార్‌లో ప్రారంభమైన సర్ ప్రక్రియ ఇప్పటివరకు మూడు దశల్లో కొనసాగింది. మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్ల ఓట్లను తొలగించింది. ఆ తర్వాత కర్ణాటకలో 1.08 కోట్ల ఓట్లు తొలగిపోయాయి. ఆ తర్వాత ఎక్కువ ఓట్లు తొలగిపోయిన మూడో రాష్ట్రం తెలంగాణ. ఇక్కడ ఏకంగా 73.39 లక్షల ఓట్లు తొలగిపోయాయి. ఓటర్ల శాతం పరంగా చూస్తే ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం ఓట్లు తొలగిపోయాయి. ఢిల్లీలో 47.57 లక్షల ఓట్లు, తర్వాత ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగిపోయాయి. అయితే, ఇది తుది జాబితా కాదు. డ్రాఫ్ట్ మాత్రమే. ప్రస్తుతం ఈ జాబితాలో ఓట్లు గల్లంతైన వారు తగిన డాక్యుమెంట్లతో సంబంధిత అధికారులను సంప్రదించాలి. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులైన వారి పేరును ఓటర్ల జాబితాలో చేరుస్తారు. అలా, పేర్లు గల్లంతైన వారు తమ అభ్యంతరాలు తెలుపుతూ సమీక్ష కోరే అవకాశం ఉంది. ఇవన్నీ పూర్తైన తర్వాత దేశవ్యాప్తంగా పూర్తిస్థాయి ఓటర్ల జాబితా వెలువడుతుంది. ఓటరు జాబితాలో మీ పేరు ఉందో, లేదో తెలుసుకోవాలనుకుంటే జశీవతీం.వఎఱ.స్త్రశీజ.ఱఅ ను సంప్రదించాలి. లేదా వోటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో కూడా చెక్ చేసుకోవచ్చు. పూర్తిగా జాబితా నుంచి పేరు గల్లంతైతే ఫాం 6, జాబితాలో పేరు ఉంచడానికి లేదా తొలగించడానికి తగిన అభ్యంతరాలపై ఫాం 7, జాబితాలో పేరుండి వివరాలు తప్పుగా ఉంటే ఫాం 8 దరఖాస్తు నింపాల్సి ఉంటుంది. అవసరమైతే బూత్ లెవల్ ఆఫీసర్‌ను కూడా సంప్రదించవచ్చు.

# నేపాల్‌లో మృత్యుఘోష.

మొదటి తరువాయి



275 మందికిపైగా భారతీయులు, 128 మందికిపైగా భారత సంతతికి చెందినవారి అడ్రస్ ఇప్పటికీ తెలియలేదని చెప్పారు. సహాయక పనుల్లో భారతీయ బృందాలు 19 మంది ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం ఖాట్మండులో సహాయక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అదనంగా భారత్ నుండి సొరంగంలో చిక్కుకుపోయిన వారిని కాపాడే బృందం కూడా నేపాల్ అధికారులకు సాయంగా ఉన్నారని చెప్పారు. చిలిమె విద్యుత్ కేంద్రం సొరంగంలో చిక్కుకున్న వారిని వెలికితీసే పనుల్లో నిమగ్నమై ఉన్న భారతీయ సాంకేతిక బృందాన్ని నేపాల్‌లో భారత రాయబారి నవీన్‌శ్రీవాస్తవ గురువారం కలిశారు. ఆధునికమైన యంత్రాలను వినియోగించడం ద్వారా సొరంగంలోపల 100 మీటర్ల వరకు సాంకేతిక బృందం చేరుకోగలిగిందని చెప్పారు. సొరంగంలో మరింత ముందుకు వెళ్లడం కోసం భారీ యంత్ర సామగ్రిని వినియోగించే ప్రణాళికలో భారతీయ సాంకేతిక బృందం ఉందని ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో శ్రీవాస్తవ పేర్కొన్నారు.

**రంగంలోకి కార్గో డ్రోన్లు**

వరద బాధిత్ ప్రాంతాలకు చేరుకోవడం అత్యంత సవాల్‌తో కూడుకున్నదని ఐక్యరాజ్యసమితి (రాస) హెచ్చరించింది. సహాయక చర్యల్లో భాగంగా ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని చేరవేయడానికి హెలికాప్టర్లు, కార్గో డ్రోన్లను వినియోగించడంపై ప్రస్తుతం చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. విపత్తు తీవ్రత, సంభవించిన నష్టం భారీగా ఉందని ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ లిలా పీటర్స్ యామియా ఖాట్మండులో మీడియాతో అన్నారు. "నివాసాలు కోల్పోయినవారిలో 84 శాతం మంది వచ్చిన 800 మందికిపైగా పర్యాటకులు ఉన్నార'ని తెలిపారు.

**పోర్టర్లే దిక్కు**

ట్రెక్కింగ్ చేసేవారు, శిఖరాలను అధిరోహించేవారి కోసం భారీ మొత్తంలో సామగ్రిని పర్వతాల మీదుగా మోసుకువెళ్లడంలో దిట్టలైన నేపాల్ పోర్టర్లు ప్రస్తుతం పరిస్థితుల్లో అక్కరకు వస్తారని ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ తెలిపారు. వరద బాధితులకు సాధ్యమైనంత త్వరగా సాయం అందించడంలో పోర్టర్ల సేవలను వినియోగించుకుంటామని చెప్పారు.

# నీళ్లపై దుష్ప్రచారం

మొదటి తరువాయి

బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. అదేవిధంగా జిల్లాల్లో జటిలమైన సమస్యల పరిష్కారానికి ఇంచార్జ్ మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిష్కారం కాని అంశాలను సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న ఆరు వేల ఎకరాలకు రెండు నెలల్లో పట్టాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములను గుర్తించి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్నినో పరిస్థితులపై వివరాలతో ఇవాళే కేంద్రానికి లేఖ రాస్తామని చంద్రబాబు తెలిపారు. గత 30 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా ఈసారి వర్షపాతం లోటు నమోదైందని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం లోటు ఉందన్నారు. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం లోటు 14 శాతం ఉంటే ఏపీలో 52 శాతం ఉందని వివరించారు. ప్రతి నెలా క్షేత్రస్థాయి పరిస్థితులను కేంద్రానికి నివేదించాలని ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటికి ఎంతైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాలకు తాగునీటిని రవాణా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవకాశం ఉన్న చోట నీటి నిల్వలు పెంచాలని, భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన అదనపు బోర్లకు అనుమతించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్డీపీ తగ్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశు గ్రాసానికి ఎలాంటి కొరత లేకుండా చూడాలని, సీడ్ బాల్స్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి మంత్రివర్గ సమావేశంలో ఎల్నినో ప్రభావం, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు విపత్తు నిర్వహణ



ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందే అన్ని అవకాశాలను పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్రానికి ఎప్పటికప్పుడు నివేదిస్తూ అవసరమైన సాయం పొందేందుకు చర్యలు తీసుకోవాలని సూచన చేశారు. జలాశయాల్లో నీరు ఉన్నప్పటికీ పంటలకు నీరు ఇవ్వడం లేదంటూ వైఎస్సార్సీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదల పైనా దుష్ప్రచారం జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మంత్రులు, పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉంటూ వాస్తవాలను వివరించాలని సూచించారు. గ్రౌండ్వాటర్ డేటాను అందుబాటులో ఉంచి రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు అవసరమైన సమాచారాన్ని అందించాలని చంద్రబాబు ఆదేశించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే కార్యక్రమాలలో అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే అవాస్తవాల ప్రభావానికి నీటి తరం లోనుకాకుండా వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వం కూడా చురుగ్గా వ్యవహరించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు. రైతు బజార్లలో బియ్యాన్ని తక్కువ ధరకు అందిస్తున్నట్లు నాదెండ్ల మనోహర్ వివరించారు. మిగిలిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సూర్యఘర్ పథకం వినియోగంలో నాలుగో స్థానంలో ఉన్న ఏపీని మొదటి స్థానానికి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. సోలార్ కోసం 20 లక్షల కనెక్షన్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు సబ్సిడీ ఇస్తున్న నేపథ్యంలో మెజార్టీ సబ్సిడీ ఆంధ్రప్రదేశ్కు దక్కేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం

మొదటి తరువాయి

ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వన్యప్రాణుల సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు అమలవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత హనుమాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి, ప్రత్యేక పరిస్థితుల్లోనూ జంతువుల సంరక్షణ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, వాటి ఫలితాలను శాస్త్రీయంగా విశ్లేషించి, అవసరమైన చోట మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్న ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీ రాష్ట్రవ్యాప్తంగా వన్య ప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాలను సందర్శించనుంది. వన్యప్రాణుల మరణాలకు దారితీస్తున్న అంశాలు, ఆవాసాల్లో పరిస్థితులు, సంచార మార్గాల్లో భద్రతా ఏర్పాట్లు,



వేట నిరోధక చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థలు, అటవీ అగ్ని ప్రమాదాల నియంత్రణ, నీటి వనరుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించనుంది. పులులు, చిరుతలు, ఏనుగులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు అమలవుతున్న కార్యక్రమాలను సమీక్షించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించనుంది. నివారణ చర్యలపై సూచనలు చేయనుంది. వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధి, సహజ ఆహార వనరుల పెంపు, సంచార మార్గాల సంరక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రత్యేక నివేదిక రూపొందించి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు అందజేయనుంది.

# తెలంగాణ, ఏపీలో వానలు...

మొదటి తరువాయి

మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుండగా, దానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీనికి తోడు, మధ్యప్రదేశ్ నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతోందని, వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు చేపల వేట కోసం బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద ఉండరాదని, అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

# రష్యా ఆయిల్ కొంటాం

మొదటి తరువాయి

అయితే, రష్యా, ఉక్రెయిన్ య[illegible]కి తాము అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చింది. అంతేకాదు, ఇది యుద్ధాల యుగం కాదని, చర్చ, దౌత్యంతోనే సమస్యను పరిష్కరించుకోవాలని, ఉక్రెయిన్, రష్యాల యుద్ధంపై తమ వైఖరి ఇదేనని జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్‌పై యూరప్ దేశాలు, అమెరికా కూడా ఆక్షేపణ వ్యక్తంచేశాయి. వార్ మెషిన్‌కు భారత్ ఇంధనం అందిస్తున్నదని, ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేసి పరోక్షంగా ఈ యుద్ధానికి భారత్ దోహదపడుతున్నదని యూరప్ దేశాలు ఆరోపణలు గుప్పించాయి. కానీ, భారత ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోలేదు. తమ దేశ ప్రజల అవసరాలు తీర్చుకోవడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని, వాస్తవానికి పశ్చిమాసియా యుద్ధంతో మార్కెట్‌లో ఏర్పడ్డ కొరతకు తాము కొంత కళ్లెం వేస్తున్నామని, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయకుంటే అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్‌లో పరిస్థితులు మరింత తీవ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

**మా కొనుగోళ్లతో యుద్ధం జరగట్లేదు**

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో మీడియాతో జైశంకర్ మాట్లాడుతూ.. 'రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపేస్తారా? లేక ఉక్రెయిన్‌పై యుద్ధానికి పరోక్షంగా దోహదపడతారా? అని ప్రశ్న వచ్చింది. 'ఈ ప్రశ్నకు కారణమేంటో నాకు తెలుసు. ప్రపంచ ఇంధన పరిస్థితి సంక్షోభం వైపు వెళ్తుండగా 140 కోట్ల మంది ప్రజలకు ఇంధన అవసరాలు తీర్చే ముఖ్యమైన సవాలుపై మీరంతా ఒకసారి ఆలోచించాలి. మరొక విషయం, ఈ యుద్ధం మొదలై ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నది.

# కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి



పరిశీలించాలని లోకేశ్ మంత్రులకు సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కొత్తగా సుమారు 3 లక్షల పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

**అక్టోబర్లోనే స్థానిక ఎన్నికలు**

స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని లోకేశ్ సూచించారు. అక్టోబర్లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని.. వాయిదా వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముందుగా పురపాలక సంస్థలు, అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**అధికారుల తీరుపై ఆగ్రహం**

శాఖలకు చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించే అధికారులు, మాట వినని అధికారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు. ఒకరిద్దరు అధికారుల పనితీరు కారణంగా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ శాఖలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ప్రచారంపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని, ఇలాంటి అంశాలను సమర్థంగా ఎదుర్కోవాలని అన్నారు.

**9న ప్రత్యేక కార్యక్రమం**

చంద్రబాబుపై గతంలో కేసులు, నిర్బంధం జరిగిన ఘటనకు మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 9న కార్యక్రమం నిర్వహించి.. ఆ తర్వాత రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని లోకేశ్ సూచించారు.

# మంగళగిరి లోని అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి న్యాయ స్థానానికి 21 పోస్టులు మంజూరు

**-మంత్రివర్గ సమావేశంలో ఆమోదం**



**అమరావతి, సెప్టెంబర్ 3,( నేటి దర్శిని )** గుంటూరు జిల్లా మంగళగిరిలోని అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి న్యాయస్థానానికి 21 పోస్టులు మంజూరు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో ఆమోదించినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం అమరావతి వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఇందులో న్యాయశాఖకు సంబంధించి ఆమోదం లభించిన అంశానికి సంబంధించిన వివరాలను న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. గతంలో ప్రభుత్వం జీవో ఎంఎస్ -6 ద్వారా 23-01-2023 న మంగళగిరిలో జిల్లా అదనపు, సెషన్స్ జడ్జి న్యాయస్థానం ఏర్పాటు కు అనుమతి మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే న్యాయస్థానం నిర్వహణ కు సంబంధించి సిబ్బందిని అప్పుడు నియమించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం మంగళగిరి శాసనసభ్యుడు, మానవ వనరుల అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్ డ కమ్యూనికేషన్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేష్ న్యాయస్థానం కు నిర్వహణ సిబ్బంది తో పాటు, పునరావృత ( రికరింగ్), పునరావృతేతర ( నాన్- రికరింగ్ )వ్యయాలను భరించేందుకు అవసరమైన బడ్జెట్ ను మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదనను తీసుకురావడం జరిగిందన్నారు.మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనను దృష్టిలో పెట్టుకొని మంగళగిరి లోని జిల్లా అదనపు, సెషన్స్ జడ్జి న్యాయస్థానం నిర్వహణకు 21 పోస్టులు మంజూరు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని మంత్రి ఫరూక్ వివరించారు.ప్రజలకు న్యాయసేవలు చేరువ చేయడంతో పాటు సత్వర న్యాయం అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

# పేకాట స్థావరంపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి..

**-ఆరుగురుని అదుపులోకి తీసుకున్న పోలీసులకు**

**-రూ.1,01,070 నగదు, 6 సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం**



**టంగుటూరు,ప్రకాశం సెప్టెంబర్ 3 ,( నేటి దర్శిని** ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.ప్రకాశం జిల్లా టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయుడుపాలెం గ్రామ రైల్వే ట్రాక్ పక్కన శివారులో గురువారం మధ్యాహ్నం సమయంలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో SI బి. వినోద్ బాబు, ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా మరియు వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.ాఈ దాడిలో 6 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ. 1,01,070/- నగదు, 6 మొబైల్ ఫోన్లు, 1 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులు అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ 9121102113, పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ప్రజా సమస్యల పైన గుంతకల్ ఆర్డీవో కు వినతి పత్రం



**,( నేటి దర్శిని ) న్యూస్ మంత్రాలయం :** పట్టణంలో దాదాపుగా వారానికి ఒకసారి నీళ్లు వదలడం వల్ల . పట్టణ ప్రజలు తాగడానికి, వాడుకోవడానికి నీళ్ల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు బాజాపా నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కాలనీలలో సింటెక్స్ మరియు బోర్లు వేసి నీళ్ళని ప్రజలు వాడుకునేలా చేశారు.. ప్రజలు వాటిని వాడుతూ ఉండటం వల్ల చాలా చోట్ల బోర్లు మరియు సింటెక్సు రిపేర్లలో ఉన్నాయి కనుక.. అధికారులు పట్టించుకోని బోర్లను పునరుద్ధరించి రిపేర్లు చేయించి సింటెక్సు మరియు బోర్లు లేని చోట బోర్లు వేయించి ప్రజలని నీళ్ల సమస్యల నుంచి ఆదుకోవాలని స్థానిక గుంతకల్లు ఆర్డీవోకు గుంతకల్ బిజెపి నాయకులు అందరూ కలిసి వినతి పత్రం అందించారు. ఆర్డీవో స్పందించి దానికి తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పడం జరిగిందని గుంతకల్ ఓల్డ్ టౌన్ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, బిజెపి రాష్ట్ర నాయకురాలు మరియు ఎఫ్సీఐ స్టేట్ డైరెక్టర్, వనగొంది విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో , పట్టణ ప్రధాన కార్యదర్శి శివ, జిల్లా ఎలక్షన్ ఇంచార్జ్ గుర్రం సూర్యనారాయణ, జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ జీఎం మహేష్, బిజెపి నాయకులు నారాయణరెడ్డి, మహిళా మోర్చా నాయకులు లక్ష్మీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఇస్కాన్ అహోబిలం వారి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు.



**ఆళ్లగడ్డ.,( నేటి దర్శిని )** మండల పరిధిలోని హరి నగరం దగ్గర గల ఇస్కాన్ దేవాలయం వారి ఆధ్వర్యంలోఅంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మ దిన వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చంద్రశేఖర్ దాస్ పేర్కొన్నారు. శ్రీకృష్ణాష్టమి జయంతి సందర్భంగా సాయంత్రం 4 గంటలకు గంటలకు ఉట్లవత్సవం,6 గంటలకు అన్నదాన వితరణ, హారతి భజన, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ చేతులు మీదుగా పోటీలో పాల్గొన్న వారికి బహుమతులు. అలాగే పాలు భక్తి రస నిర్వహించబడుతున్నారు. 5వ తేదీన ఉదయం 10 గంటలకు వైష్ణవ భజన కీర్తనలు,11 గంటలకు శ్రీ ల ప్రభుపాద అభిషేకం వ్యాస పూజా ప్రవచనం, మధ్యాహ్నం 56 వంటకాలచే భోజనం ఏర్పాట్లు, శ్రీ ల ప్రభు పాద పుష్పాంజలి. కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ అహోబిల దేవాలయం కార్యనిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పాభక్తులందరూ హాజరై దేవుని కృపకు ఆశీర్వాదాలు పొందాలని కోరారు.

# కరెంట్ దొంగలకు విజిలెన్స్ షాక్!

**- 30 మందిపై కేసులు.. 20 మందికి జరిమానా**

**- రూ.10 లక్షల అపరాధ రుసుము**




**చిట్వేలి, సెప్టెంబర్ 3 ,( నేటి దర్శిని )** విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. చిట్వేలి, పెనగలూరు మండలాల్లోని ఐదు గ్రామాల్లో గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మీటర్ లేకుండా విద్యుత్ లైన్ నుంచి నేరుగా కరెంట్ వినియోగిస్తున్న 30 మంది గృహ వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. చిట్వేలి మండలంలోని వెంకటరాజుపల్లి, సి.ఎం. రాచపల్లి, ఎన్. వడ్డిపల్లి, పెనగలూరు మండలంలోని నల్లపురెడ్డిపల్లి, జడవారిపల్లి గ్రామాల్లో స్థానిక విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది సోదాలు నిర్వహించారు. మరో 20 మంది వినియోగదారులకు అదనపు విద్యుత్ లోడ్ రుసుములు చెల్లించే విధంగా జరిమానాలు విధించారు. కేసులు, జరిమానాలు కలిపి సుమారు రూ. 10 లక్షల అపరాధ రుసుము విధించినట్లు జిల్లా విజిలెన్స్ ఈఈ టి. ప్రభాకర్ తెలిపారు. వినియోగదారులు మీటర్ ద్వారా విద్యుత్‌ను వినియోగించి, సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆయన సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చిట్వేలి ఏఈ బాలకృష్ణ, పెనగలూరు ఏఈతో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్’ పై చీఫ్ ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్..



**ఒంగోలు, ప్రకాశం సెప్టెంబర్ ,( నేటి దర్శిని )** గురువారం అమరావతి నుండి చీఫ్ ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్స్ తో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్) పై వీడియో వీక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు కలెక్టరేట్ లోని సమావేశ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ఫైనల్ డిస్పోసల్స్ 73,212 ఉన్నాయని ఎక్కువగా కందుకూరు నియోజికవర్గం లో ఉన్నాయని చీఫ్ ఎన్నికల్ అధికారికి తెలిపారు. అదే విధముగా సవరించిన షెడ్యూల్ ప్రకారం సర్ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోపల పూర్తిచేయడం జరుగుతుందని వివరించారు. ఫైనల్ పబ్లికేషన్ 09.10.26 న ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబందిత సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిది కచ్చితంగా నిర్దేశిత డాక్యుమెంట్లు ఫైలింగ్ చేయడం తో పాటు ఎటువంటి పిర్యాదులు లేకుండా చూడాలన్నారు. వలస వోటర్లు మరియు చనిపోయిన వారి వివరాలు జాగ్రత్తగా పొందుపరచి డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ప్రతి క్లైము క్షుణ్ణంగాన్నంగా పరిశీలించాలన్నారు.ఈ కార్యక్రమంలో జయింటి కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ, జిల్లా రెవిన్యూ అధికారి వెంకట రమణ, రెవిన్యూ డివిజినల్ అధికార్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో మాజీ సీఎం జగన్.. ఎస్.వీ. మోహన్‌రెడ్డి కుమారుడి రిసెప్షన్‌కు హాజరు



**కర్నూలు బ్యూరో,సెప్టెంబర్ 3 ,( నేటి దర్శిని )** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ. మోహన్‌రెడ్డి కుమారుడు జనక్ వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరయ్యారు.కర్నూలులోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్ జగన్ పాల్గొని నూతన వధూవరులు శ్రియ-- జనక్‌లను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వధువు శ్రియ.. రాజమండ్రి రుడా మాజీ ఛైర్మన్ షర్మిల, మేడపాటి అనిల్‌రెడ్డి దంపతుల కుమార్తె. ఈ వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి వైసీపీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ఏ. గఫూర్, కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు.

# ఆర్డీటీకి సంపూర్ణ సహకారం

**-ఎమ్మెల్యే పరిటాల సునీత**



**రాప్తాడు, సెప్టెంబర్ 3 ,( నేటి దర్శిని )** రాప్తాడు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) అందిస్తున్న సేవలకు రాష్ట్ర ప్రభుత్వం, టీడీపీ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ఆర్డీటీ వ్యవస్థాపకులు కీ.శే. ఫాదర్ ఫెర్రర్ సతీమణి అన్నే ఫెర్రర్, సంస్థ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలో ఆర్డీటీ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలపై వారితో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆర్డీటీ చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరమని ఆమె పేర్కొన్నారు.రాప్తాడు నియోజకవర్గంలో ఆర్డీటీ చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు టీడీపీ ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పరిటాల సునీత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ నాయుడు, ఆత్మకూరు టీడీపీ ఇన్‌చార్జి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సేఫ్ క్యాంపస్...

**-ఈగల్ సెల్ అధికారులు సంయుక్తంగా విద్యాసంస్థల వద్ద తనిఖీలు**

**-నిషేధిత వస్తువులు విక్రయిస్తున్న 4 దుకాణాల యజమానులకు జరిమానాలు**



**అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 3 ,( నేటి దర్శిని )** విద్యాసంస్థల పరిసరాల్లో అక్రమ వ్యాపారాలు, అసాంఘీక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం మూడో పట్టణ పోలీసులు, ఈగల్ సెల్ అధికారులు ఈరోజు ‘ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్’ పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని 4వ రోడ్డు ప్రాంతంలో ఉన్న నేతాజీ హైస్కూల్, పీఆర్కే జూనియర్ కాలేజీ, సన్‌షైన్ హైస్కూల్ తదితర విద్యాసంస్థల చుట్టూ 500 మీటర్ల పరిధిలోని 6 కిరాణా దుకాణాలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని నిషేధిత వస్తువులు విక్రయిస్తున్న 4 దుకాణాల యజమానులకు జరిమానా విధించారు.?విద్యాసంస్థల పరిసరాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది, జిల్లా ‘ఈగల్ సెల్’ ఎస్సై హనుమంతు ఆధ్వర్యంలో బృందం పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ 'డ్రాగన్' లో షాహిద్ కపూర్, ఆలియా భట్.?

ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ప్రాజెక్ట్ 'డ్రాగన్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, ప్రముఖ నటి ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించిన వార్తలు అటు బీ టౌన్‌తో పాటు ఇటు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇందులో షాహిద్ కపూర్ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనుండగా, ఆలియా భట్ కీలకమైన పాత్రలో ఎన్టీఆర్ సరసన నటించనున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతున్న ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో మరియు టాలీవుడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ ప్రాజెక్ట్‌ను ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్, యువ సుధా ఆర్ట్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



# ప్రశాంత్ నీల్ మూవీకి సెన్సార్ కష్టాలు..

**-రివైజింగ్ కమిటీని ఆశ్రయించిన '418' టీమ్!**




అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన హారర్ సినిమా '418' సెన్సార్ బోర్డు అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఈ సినిమాలో హారర్ సీన్లు ఎక్కువగా ఉన్నాయంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అభ్యంతరం తెలపడంతో, మేకర్స్ రివైజింగ్ కమిటీని ఆశ్రయించారు. కిర్తన్ నాడగౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 31నే విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడింది. అయితే సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన కిర్తన్ నాడగౌడ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నాడు. అయితే ఒక హారర్ చిత్రంలో హారర్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఉన్నాయని సెన్సార్ బోర్డు అభ్యంతరం తెలపడం పట్ల నెటిజన్లు సోషల్ మీడియాలో సంధిస్తున్నారు. 'హారర్ సినిమాలో హారర్ సీన్లు కాక ఇంకేముంటాయి?' అంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు.




# మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి



సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్టమీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ్' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.



# త్రిష కొత్త చిత్రం

రాజకీయపరమైన అంశాలకు దూరంగా అగ్ర కథానాయిక త్రిష ప్రస్తుతం సినిమాలపై దృష్టిపెడుతున్నది. తమిళనాడు సీఎం విజయ్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఈ భామ పేరు తరచూ పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో త్రిష కొత్త చిత్రం బుధవారం ప్రారంభమైంది. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నిర్మాణ సంస్థ పనోరమా స్టూడియో తమిళ ఫిల్మ్‌ప్రొడక్షన్‌లోకి అడుగుపెడుతున్నది. 'ఎయిర్‌లిఫ్ట్' చిత్రంతో గుర్తింపు పొందిన రాజాకృష్ణ మీనన్ ఈ చిత్రానికి దర్శకుడు. సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కబోతున్న ఈ సినిమాలో త్రిష పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెబుతున్నారు. ఇందులో రాధికా శరత్‌కుమార్, అపర్ణ బాలమురళి కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# 200 కోట్ల మార్క్ దాటిన ఆవారాపన్-2'




ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450